క్లుప్తంగా

పదవికి న్యాయం చేస్తా

నెల్లూరు(సెంట్రల్): తనపై ఎంతో నమ్మకంతో నుడా చైర్మన్ పదవిని రెండోసారి ఇచ్చారని, దీనికి న్యాయం చేస్తానని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు ఆదివారం ఆయన నివాళులర్పించారు.

ట్రై సైకిల్ వితరణ



నెల్లూరు(దర్గామిట్ట): ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన మహిళకు ట్రై సైకిల్‌ను వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన శోభ టోల్ ప్లాజా వద్ద రెండేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయారు. విషయం తెలుసుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు బాధితురాలికి ట్రై సైకిల్‌ను నగరంలోని తమ నివాసంలో అందజేశారు. ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

నేత్రపర్వంగా సహస్ర శంఖాభిషేకం



నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సహస్ర శంఖాభిషేకం, ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా పోతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాలిని, ఇసనాక దేవసేనమ్మ, పిడూరు శ్రీనివాసులురెడ్డి, కవిత, కొండూరు రాఘవేంద్ర, సురేఖ వ్యవహరించారు.

ప్రజల ఇక్కట్లు తీర్చండి



ప్రజాపోరు యాత్రలో సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని.. మత్తు పదార్థాలు, డ్రగ్స్ విక్రయాలు యథేచ్ఛగా సాగుతుండటంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని.. ప్రజల ఇక్కట్లను ఇప్పటికైనా తీర్చాలని సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా నగరంలోని 3, 4, 5, 53, 54వ డివిజన్లలో ఆదివారం పర్యటించిన వారు మాట్లాడారు. పెన్నా పక్కనే ఉండే ప్రాంతాల్లో తాగునీటికి సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. టిడ్కో గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆరోపించారు. నూతన మద్యం పాలసీతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారమయ్యేంత వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణ, కాయల శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు మూలం ప్రసాద్, పద్మ, జాఫర్, నరసింహ, శ్రీనివాసులురెడ్డి, రషీద్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన న్యూ టాకీస్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడు 40 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు కలిగి.. నలుపుపై ఎరుపు రంగు చారలు కలిగిన టీ షర్టు, కాఫీ రంగు కాటన్ జీన్స్ ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. మృతదేహాన్ని గుర్తించి.. వీఆర్వో శివకుమార్‌కు స్థానికులు సమాచారం అందించారు. సంతపేట పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. ఎస్సై బాలకృష్ణ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఇసుక లారీ స్వాధీనం

బుచ్చిరెడ్డిపాళెం: ఇసుకను తరలిస్తున్న టర్బో లారీని పట్టణంలో ఎస్సై సంతోష్‌రెడ్డి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. సంగంలోని రీచ్ నుంచి ఇసుక లోడుతో ఒంగోలు వెళ్తున్న లారీని అదుపులోకి తీసుకొని జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులకు సమాచారమిచ్చారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా..

- జిల్లా వ్యాప్తంగా నాకాబందీ
- డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ మద్యసేవనంపై ఉక్కుపాదం
- వాహనచోదకులకు భారీగా జరిమానాలు
- రికార్డులకెక్కిన నేరస్తులపై రౌడీషీట్లు



నగరంలో వాహన తనిఖీలను నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఎస్పీ కృష్ణకాంత్ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పల్లెనిద్ర పేరిట జిల్లావ్యాప్తంగా గ్రామాలు, వార్డులు, డివిజన్లలో పోలీస్ అధికారులు పర్యటిస్తూ చీకటి కార్యకలాపాలు, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతున్నారు. మరోవైపు నాకాబందీ, కార్డన్‌సెర్చ్‌లను నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచారు. నేరాలకు తరచూ పాల్పడుతూ, పోలీస్ రికార్డులకెక్కిన వారిని గుర్తించి రౌడీషీట్లు తెరుస్తున్నారు. తాజాగా నేరాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులపై రౌడీషీట్లను చిన్నబజార్ పోలీసులు తెరిచారు. మరికొందరిపై తెరవనున్నారు. జిల్లాలోని యాక్టివ్ రౌడీషీటర్లపై పీడీ యాక్ట్‌ల నమోదుకు జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

క్షుణ్ణంగా వాహన తనిఖీలు

జిల్లావ్యాప్తంగా నాకాబందీని పోలీస్ అధికారులు నిర్వహిస్తున్నారు. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో వాహన తనిఖీలను విస్తృతం చేశారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. రికార్డుల్లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారికి భారీగా జరిమానాలను విధిస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కొరడా

మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి వెహికల్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నారు. బహిరంగ మద్యసేవనంపై కొరడా ఝుళిపిస్తున్నారు. నాకాబందీ సత్ఫలితాలను ఇస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహిస్తున్నారు. తాజాగా శనివారం రాత్రి 11 నుంచి ఆదివారం తెల్లవారుజామున ఒంటి గంట వరకు నాకాబందీని జరిపారు.

కేసులు నమోదు..

- మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్న 20 మంది.. బహిరంగంగా మద్యాన్ని సేవిస్తున్న 37 మందిపై కేసులు నమోదు చేశారు.
- నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడుపుతున్న వారిపై 200 కేసులు నమోదు చేసి 29 బైక్‌లను సీజ్ చేశారు. రూ.1,04,400 జరిమానాను విధించారు.
- గత నెల 28 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన నాకాబందీలో మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 63 మంది.. బహిరంగంగా మద్యాన్ని సేవిస్తున్న 112 మందిపై కేసులు నమోదు చేశారు.

విస్తృతంగా నాకాబందీ



ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించడమే లక్ష్యం. దీనికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. నాకాబందీని విస్తృతం చేస్తాం. ప్రజాజీవనం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేదిలేదు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచాం. నేరాలకు పాల్పడుతూ తప్పించుకుతిరుగుతున్న వారిపై రౌడీషీట్లు తెరుస్తున్నాం. నేరనియంత్రణకు పోలీసులు చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలి. – కృష్ణకాంత్, ఎస్పీ

బరితెగించిన భూ మాఫియా

- ప్రభుత్వ పొరంబోకు స్థలాలను విక్రయించిన వైనం
- లబోదిబోమంటున్న కొనుగోలుదారులు



అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్లో గల జనార్దన్‌రెడ్డికాలనీలో వివాదాస్పద స్థలంలో నల్లకాలువను ఆనుకొని ఉన్న ప్రభుత్వ పొరంబోకు భూమిలో వందలాది ఎకరాలను స్థానిక భూమాఫియా నేతలు ఆక్రమించారు. తప్పుడు పత్రాలను సృష్టించి కొన్నేళ్లుగా ఈ తంతును సాగించారు. విషయం తెలియని చాలా మంది తక్కువ రేటుకు స్థలం లభిస్తోందనే ఆశతో వీటిని కొనుగోలు చేశారు. మరికొందరు ఇళ్లనూ నిర్మించుకున్నారు. ఇటీవల చోటు చేసుకున్న స్థల వివాద నేపథ్యంలో సర్వేను కార్పొరేషన్ అధికారులు నిర్వహించారు. నల్లకాలువను ఆనుకొని ఉన్న ప్రభుత్వ పొరంబోకు స్థలాల్లో ఎకరాలకు ఎకరాల్లో క్రయవిక్రయాలు జరిగాయనే అంశాన్ని గుర్తించారు. దీంతో ఇళ్లు నిర్మించకుండా ఖాళీగా ఉన్న స్థలాలను గుర్తించి ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. వీటిని కొనుగోలు చేసి తాము మోసపోయామంటూ పలువురు లబోదిబోమంటున్నారు. స్థానికంగా ఉన్న కొందరు తమ భూమిగా చెప్పుకొని తమకు విక్రయించారని ఆరోపించారు.

టిడ్కో స్థలంలోనూ కబ్జా పర్వం

జనార్దన్‌రెడ్డికాలనీలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలకు సంబంధించిన స్థలాన్నీ కొందరు ఆక్రమించారు. ప్రస్తుతం కట్టడాలనూ ప్రారంభించారు. దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం

జనార్దన్‌రెడ్డికాలనీలోని మౌలాలీ మకాన్ వీధిలో గల వివాదాస్పద స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులను కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. స్థల విషయమై టీడీపీ డివిజన్ నేతలు జహీర్, ముజీర్ వర్గాల మధ్య ఇటీవల ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనలో పలువురు గాయపడి ఆస్పత్రుల పాలైన విషయం విదితమే.



జనార్దన్‌రెడ్డికాలనీలో ఆక్రమణకు గురైన టిడ్కో స్థలం



వివాదాస్పద స్థలంలో ప్రహరీని నిర్మిస్తున్న అధికారులు

ప్రజాపోరు యాత్ర ప్రారంభం



మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వర్లు

నెల్లూరు సిటీ: మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ పొట్టేపాళెంలో ప్రజాపోరు యాత్రను సీపీఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నేత మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగ సమస్య తీవ్రమైందని మండిపడ్డారు. ఉపాధి పనులకు సంబంధించిన నిధులకు బడ్జెట్లో కోత విధించారని, దీంతో పనులు సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.17 వేల కోట్ల భారం మోపుతోందని ఆరోపించారు. పొట్టేపాళెం, ములుమూడిలోని కలుజులపై హైలెవల్ వంతెనలను నిర్మించాలని కోరారు. నెల్లూరు – తాటిపర్తి రోడ్డును సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాల్, అల్లాడి గోపాల్, పార్టీ నెల్లూరు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, మండల కమిటీ సభ్యులు రమణ, అనిల్, ముత్యాల నాగయ్య, పాదర్తి మస్తానయ్య, వెంకటేశ్వర్లు, బాలు, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన కార్యక్రమాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కిమ్స్ సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ ఏవీ రెడ్డి అవగాహన కల్పించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, సెక్రటరీ స్వర్ణ రమేష్‌బాబు, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, చింతల అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపు భవన్ అభివృద్ధే లక్ష్యం



మంత్రి దంపతులకు సత్కారం

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని కాపు భవనాన్ని మరింత అభివృద్ధి చేస్తానని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని కాపు భవన్‌లో ఆదివారం నిర్వహించిన వన భోజన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి దంపతులను సత్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఉచిత వైద్యశిబిరాలు ఎంతో ఉపయోగం

ఉచిత వైద్యశిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగమని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నగరంలోని కాపు భవన్ వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని డాక్టర్ కేర్ హోమియోపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీని మంత్రి పరీక్షించుకున్నారు. కాప్స్ రాక్స్ ఫౌండర్ పెద్దిరెడ్డి, శివభాస్కర్, జనసేన నేత గునుకుల కిశోర్, హోమియోపతి డాక్టర్ మధుసూదన్, డాక్టర్లు విజయకృష్ణ, భారతి, దివ్య, మేనేజర్ బాబు, సిబ్బంది రామకృష్ణ, మౌనిక, కావ్య పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు కృతజ్ఞతలు



నెల్లూరు(బృందావనం): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి జిల్లా అర్చక సమాఖ్య నేతలు కృతజ్ఞతలను తెలియజేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అర్చకుల సమస్యలను పరిష్కరిస్తూ.. ధూపదీప నైవేద్య పథకానికి రూ.ఐదు వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ పథకాన్ని అమలుచేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రిని నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం కలిశారు. అర్చక సమాఖ్య నేతలు ఉదయగిరి వెంకటశేషాచార్యులు గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, వఝుల శ్రీనివాసులు, రామాయణం మణి, శ్రీశైలం శ్రీధర్, పారా శ్రీధర్, సత్యనారాయణ, బాలసుబ్రహ్మణ్యం, లోకా ప్రసాద్, టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి వాలీబాల్, త్రోబాల్ పోటీలు



నెల్లూరు (టౌన్): ఈశా ఫౌండేషన్ గ్రామోత్సవాల్లో భాగంగా పురుషులకు వాలీబాల్, స్త్రీలకు త్రోబాల్ పోటీలను ఈ నెల 16, 17న నిర్వహించనున్నామని వలంటీర్లు బ్రహ్మయ్య, మాధవ్ పేర్కొన్నారు. దర్గామిట్టలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా ఈశా వలంటీర్ల మీట్‌లో వారు మాట్లాడారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు తమ వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసపత్రాలను అందజేయనున్నామని వివరించారు. వివరాలకు 76618 08710, 94405 35032 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి, పీడీ విజయకుమార్, వాలీబాల్ కోచ్‌లు జయరావ్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతికి సంతాపం



నాగయ్య (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నవాబుపేట పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న నాగయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతికి నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, ఏపీ పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీహరి సంతాపం తెలియజేశారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డి మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా తనను నియమించిన సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలను తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో కార్తీక మాస దీపోత్సవ వేడుకలను ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. శాస్త్రీయ నృత్య పోటీలను జరిపారు. తొలుత పార్వతీ, పరమేశ్వరుల చిత్రపటానికి దీపప్రజ్వలన చేశారు. పరమేశ్వరుడ్ని కీర్తిస్తూ ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. ముఖ్యఅతిథులుగా 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, టౌన్‌హాల్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం కళాకారుడు ప్రసాద్‌ను సత్కరించారు. కేతా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదీప్, రఘురామిరెడ్డి, సత్యనారాయణ, మల్లికార్జున్, డ్యాన్స్ మాస్టర్ రమణయ్య పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా నేడు

నెల్లూరు(అర్బన్): ఎల్ఐసీలో కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న పెనుమార్పులను నిరసిస్తూ దర్గామిట్టలోని డివిజన్ కార్యాలయ ఎదుట ధర్నాను సోమవారం నిర్వహించనున్నామని ఏఓఐ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెంట్లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నెల్లూరు(బృందావనం): నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఉదయం పది నుంచి అర్జీలను అందజేయొచ్చని చెప్పారు.

అమీర్‌జాన్ చిత్రానికి ప్రశంసలు


నెల్లూరు(బృందావనం): కేరళలోని వయనాడ్ జిల్లా సుల్తాన్ బతేరిలో దక్షిణ భారతదేశ స్థాయిలో ఆర్ట్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ఇందులో నెల్లూరుకు చెందిన చిత్రకారుడు అమీర్‌జాన్ చిత్రం ప్రశంసలను అందుకుంది. ఆయన చిత్రీకరించిన విశ్వవీక్షణం చిత్రానికి ఆర్ట్ క్యాంప్ నిర్వాహకులు, బెంగళూరు, చెన్నైకు చెందిన చిత్రకారులు కళారత్న దేవీజీ, రాఖీ ప్రశంసపత్రం, జ్ఞాపికను అందజేశారు.

ఘనంగా కాకాణి జన్మదినం



నెల్లూరు(బృందావనం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వేదాయపాళెంలోని ప్రగతి చారిటబుల్ ట్రస్ట్‌లో ఆదివారం నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి, పండ్లు అందజేశారు. అనంతరం అల్పాహారాన్ని పంపిణీ చేశారు. పార్టీ నేతలు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, మందల వెంకటశేషయ్య, బచ్చల సురేష్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు ప్రసాద్, ఉప్పల శంకరయ్యగౌడ్, తలమంచి సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

సురేష్‌రెడ్డికి అభినందన



నెల్లూరు(అర్బన్): ఆర్టీసీ రీజినల్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో ఏపీజేఏసీ నేతలు ఆదివారం అభినందించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున, సంయుక్త కార్యదర్శి బషీర్, ఇందుకూరుపేట తాలూకా అధ్యక్షుడు నారాయణరెడ్డి, నెల్లూరు సిటీ కార్యదర్శి ఫణీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ శాఖలో నూతన సంస్కరణలు



మాట్లాడుతున్న నారాయణ

నెల్లూరు(బృందావనం): మున్సిపల్ శాఖలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టనున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బిల్డర్ అసోసియేషన్ నేతలు, అధికారులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్డర్లు, లేఅవుట్‌దారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్ణీత వ్యవధిలో అనుమతులిచ్చేలా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి అప్రూవల్ సిస్టమ్‌పై అధ్యయనం చేసేందుకు గానూ అధికారులను 20 రాష్ట్రాలకు పంపామని చెప్పారు. వీరి నివేదిక ఆధారంగా నూతన సంస్కరణలను తీసుకురానున్నామని వెల్లడించారు. అనుమతులను సులభతరం చేసేందుకు సింగిల్ విండో విధానాన్ని తీసుకురానున్నామని ప్రకటించారు. ఆన్‌లైన్ ద్వారా అనుమతులొచ్చేలా చర్యలు చేపడతామని వివరించారు. ఐదంతస్తుల నిర్మాణంలో ఏమైనా తేడాలొస్తే లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులను నమోదు చేయిస్తామని స్పష్టం చేశారు. కమిషనర్ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక లక్ష దీపోత్సవం



ఆకాశదీపాన్ని వెలిగిస్తూ..



పుష్పాలతో పార్వతీ పరమేశ్వరుల అలంకారం

నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం ఆదివారంతో ముగిసింది. విశేష చండీహోమం, 501 మంది దంపతులతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, వేమిరెడ్డి కోటారెడ్డి దంపతులను అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అనంతరం యాగశాలలో నిర్వహిస్తున్న చండీ హోమానికి హాజరయ్యారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. లక్ష దీపోత్సవ కమిటీ నిర్వాహకులు కంజర్ల భాస్కర్‌శర్మ, ఆమంచర్ల ప్రభాకర్‌రావు, సునీల్, ఆశం విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

- శివపార్వతుల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రీశైల అర్చకుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు.
- దీపం పరమాత్మకు ప్రత్యేకమని.. సనాతన హిందూ సంప్రదాయంలో దీపానికి ఎంతో విశిష్టత ఉందని మైసూరు దత్తపీఠ ఉత్తరాధిపతి దత్తవిజయానంద తీర్థ అనుగ్రహభాషణ చేశారు. దీపాలను వెలిగించడంపై తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించి, దీప ప్రాశస్త్యాన్ని వివరించాలని కోరారు. తొలుత ఆకాశదీపాన్ని ప్రజ్వలింపజేసి.. అయోధ్య బాలరాముడు, త్రయంబకేశ్వరుడ్ని దర్శించుకొని పూజలు, అభిషేకాలను జరిపారు.



శివలింగానికి అభిషేకం



నృత్య ప్రదర్శన